అకారణంగా ఓట్లు తొలగిస్తే శిక్షార్హులే

- శాఖాపరమైన చర్యలే కాదు, క్రిమినల్ కేసులూ తప్పనిసరి
- చంద్రగిరిలో అసాధారణంగా చేర్పులు, తొలగింపులు
- గరుడ యాప్ ద్వారా ఓట్లు తొలగిస్తున్నారనే ప్రచారముంది
- దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి
- 'ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్' ప్రత్యేక ఫోన్ ఇన్‌లో మాజీ ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్



ఈనాడు, ఈనాడు డిజిటల్, అమరావతి

'ఏ కారణమూ లేకుండా ఓటు తొలగించడం వ్యక్తుల ప్రాథమిక హక్కును కాలరాయడమే. నోటీసు ఇవ్వకుండా ఇలా తొలగించిన అధికారులు శిక్షార్హులు. వారిపై (బీఎల్వో, ఆపై అధికారులు) శాఖాపరమైన చర్యలే కాదు, సెక్షన్ 32 ఆర్‌పీఏ యాక్ట్ ప్రకారం ఐపీసీ సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు పెట్టాలని ఎన్నికల సంఘం నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి' అని సిటిజన్స్ ఫోరం ఫర్ డెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విశ్రాంత ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో అసాధారణంగా కొత్తగా ఓటు నమోదుకు 49,956, ఓట్ల తొలగింపునకు 30 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయని గుర్తుచేశారు. బహుశా దేశంలోనే అరుదైన ఇలాంటి ఉదంతాలను ఈసీ ప్రశ్నించుకోవాలని, ఆన్‌లైన్‌లో కుప్పలుగా వచ్చి పడుతున్న అర్జీలపై అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని అభిప్రాయపడ్డారు. 'ప్రత్యర్థి పార్టీల ఓట్లు తొలగించాలనే కుట్రతో ఇదంతా జరిగినట్టు తెలుస్తోంది. అధికారంలో ఉన్న పార్టీలకే ఇది సాధ్యమవుతుంది. గరుడ అనే యాప్ ద్వారా చాలామంది ఓట్లు తొలగిస్తున్నారని విన్నా. ఈ తరహా యాప్‌లను అడ్డుకోవాలి. వీటిని వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు. 'ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో 'ఓటు హక్కు రక్షణ-సందేహాలు, సలహాలపై' ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఫోన్ ఇన్ కార్యక్రమంలో పలువురు అడిగిన ప్రశ్నలకు రమేశ్‌కుమార్ సమాధానాలిచ్చారు. ఆ వివరాలివి..

? ఓటరు నమోదుకు ఫాం-6 దరఖాస్తు చేసినప్పుడు ఇంటి నంబర్ ఆధారంగా నిర్దేశిత పోలింగ్ బూత్‌లలో కాకుండా, వేర్వేరు బూత్‌లలో నమోదు చేస్తున్నారు. తహసీల్దారు, ఆర్డీవోను అడిగితే మళ్లీ ఫాం-8 పెట్టుకోవాలని చెబుతున్నారు. నిర్దేశిత బూత్‌లలో ఓట్లు నమోదయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎవరిది? తద్విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు?

–వెంకటేశ్వర్లు, నందిగామ

సమాధానం: నిర్దేశిత పోలింగ్ బూత్‌లోనే ఓటు నమోదు చేసే బాధ్యతను అధికార యంత్రాంగమే తీసుకోవాలి. కొత్తగా నమోదయ్యే ఓట్లు స్థానిక పోలింగ్ బూత్‌లోనే ఉండేలా చూడటం బీఎల్వో విధి. సూపర్‌వైజర్ అధికారి దాన్ని సరిచూసుకోవాలి. వారు బాధ్యతారాహిత్యంతో పని చేస్తే ఏఈఆర్వోకు, ఈఆర్వోకు ఫిర్యాదు చేయొచ్చు. సంతృప్తికరంగా విధులు నిర్వర్తించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఈసీ నిర్దేశించింది. అక్రమాలకు పాల్పడిన వారిపై ఐపీసీ సెక్షన్ల కింద క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు.

? సమాచారం ఇవ్వకుండానే ఓటరు కార్డుపై ఫొటో తొలగించారు. యాప్ ద్వారా ఫిర్యాదు రిజిస్టర్ చేశా. నేనున్న చోటు నుంచి 5 కి.మీ దూరంలోని ప్రాంతానికి ఓటును మార్చి తర్వాత అక్కడా తొలగించారు. నెలన్నర క్రితం మళ్లీ ఫాం-6 సమర్పించాను. ఇప్పటికీ అతీగతీ లేదు. నాఓటు మళ్లీ ఎలా సంపాదించుకోగలను?

–నాగేశ్వరరావు, కాకినాడ

సమాధానం: వయోజనులకు ఓటు అనేది ప్రాథమిక హక్కు. ఉదారంగా కల్పించేదేమీ కాదు. విధిగా ఇవ్వాల్సిందే. జనవరి 22న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో పేరు లేకుంటే 15 రోజుల్లోగా కలెక్టర్‌కు లేదా ఆన్‌లైన్‌లో ఈసీకి ఫిర్యాదు చేయండి.

? వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఎలా నమోదు చేయాలి? ఆ అవకాశం ఎప్పుడిస్తారు?

–రవి, కడప

సమాధానం: ఫాం-8బీ ద్వారా ఈసీ ఈ అవకాశం కల్పించింది. పూర్తి వివరాలతో అర్జీ సమర్పిస్తే పోలింగ్‌కు రెండు రోజులు ముందు ఎన్నికల సిబ్బంది ఓటరు ఇంటికి వచ్చి అర్హులైన వారికి అవకాశం కల్పిస్తారు.

? అర్హుల ఓట్లు చాలా తొలగిస్తున్నారు. బాధ్యులైన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

–వెంకటేశ్వర్లు, విజయవాడ

సమాధానం: కచ్చితంగా చర్యలు తీసుకోవాలి.

? రాజ్యాంగం ప్రకారం ఓటు వయోజనుల హక్కు. మరి అర్హులందరికీ ఓటు హక్కు ఎందుకు కల్పించలేకపోతున్నారు? లేనివారిని ఎందుకు పట్టించుకోవట్లేదు? దీనిపై ఎవరూ ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు?

–నాగభూషణం, హైదరాబాద్

సమాధానం: దేశంలో వలస కార్మికులకు ఓటు హక్కు కల్పించడంపై ఈసీ సానుకూల ధోరణితోనే ఉంది. ఇంటింటి సర్వేకు వచ్చినపుడు వలస కార్మికులు ఇళ్ల వద్ద లేకుంటే, వారి ఓట్లను తొలగించకుండా రెండో అవకాశం కల్పించాలన్నది నిబంధన. ప్రతి వ్యక్తికీ తను కోరుకున్న చోట ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత వ్యవస్థపై ఉంది. అలాగే ఏదో ఒకచోట నమోదు చేసుకోవాల్సిన బాధ్యత కూడా ప్రతి వ్యక్తిపైనా ఉంటుంది.

కానీ రాష్ట్రంలో తప్పుచేసిన ఏ ఒక్క అధికారిపైనా చర్యలు తీసుకోలేదు. ఉరవకొండలో ఈఆర్‌వోలు మోసపూరితంగా, నేరపూరితంగా ఓట్లు తొలగించారు. దీన్ని ఈసీఐ నిజనిర్ధారణ కమిటీ ధ్రువీకరించి, బాధ్యులైన అధికారుల్ని సస్పెండ్ చేసింది. తప్పుచేసిన వారిపై ఆర్పీఐ యాక్ట్ సెక్షన్ 32 కింద చర్యలు తీసుకోవాలి. ఐపీసీ 182 కింద కేసులు పెట్టాలి. అప్పుడే తప్పులు పునరావృతం కావు.

? ఓటరు కార్డుపై పాత ఫొటోలు ఉండటంతో గుర్తింపునకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీన్ని తాజా వివరాలతో అప్‌డేట్ చేయించుకోవడం ఎలా?

–మల్లేశ్వరరావు, విజయవాడ

సమాధానం: ఓటర్ ఎపిక్ కార్డును అప్‌డేట్ చేసుకొనే వెసులుబాటు ఉంది. పాత ఫొటోతో పాటు కొత్త ఫొటోను జతచేసి దరఖాస్తు చేసుకోవాలి.

? నా ఓటును పంచాయతీ ఎన్నికల్లో తీసేశారు. ఎలా దరఖాస్తు చేయాలి?

–వెంకటేశ్వర్లు సంతనూతలపాడు

సమాధానం: 2020, 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. కొత్త జాబితాలో మీ ఓటు ఉన్నదీ లేనిదీ ప్రాథమికంగా తనిఖీ చేసుకోండి. లేకపోతే కొత్తగా ఫాం-6 నింపి సమర్పించండి.

? ఇంటి నంబర్ల ప్రకారం జాబితాలో ఓట్లు లేవు. ఓటుందో లేదో తెలుసుకోవడం కష్టమవుతోంది. బూత్‌లు మారిపోయాయి. దొంగ ఓట్లను గుర్తించలేకపోతున్నాం. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు.

–కృష్ణారావు, వినుకొండ,

–బాలాజీరెడ్డి, కర్లపాలెం

సమాధానం: ఇది రూల్-6ను అతిక్రమించడమే. బూత్ మార్పు వల్ల మీకేమైనా సమస్య ఉంటే ఫాం-8 కింద దరఖాస్తు చేసుకోండి.

? ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓటరు గుర్తింపు కార్డులు ఉండటానికి కారణమేంటి? దీన్ని ఎలా నివారించాలి?

–శ్రీనివాస్, నాయుడుపేట,

–వెంకటేశ్వర్లు, పుల్లేటికుర్రు

సమాధానం: ఇది వ్యవస్థాగత లోపం. ఆధార్ కార్డుతో ఓటర్ కార్డుల్ని అనుసంధానిస్తే ఈ సమస్య పరిష్కారమవుతుంది. కానీ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఐచ్ఛికంగానే ఆధార్ అనుసంధానం చేసే వీలుంది. డీసీఈ/పీఎస్ఈ కేటగిరీల్లో దొంగ ఓట్లు ఉంటే గుర్తించి తొలగించాలి. సమర్థమైన క్షేత్రస్థాయి తనిఖీలతో తొలగించవచ్చు.

యాంకర్ ప్రశ్నావళి

? మాకు తెలియకుండానే ఓట్లు తీసేశారని చాలామంది చెబుతున్నారు? బాధ్యులపై ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు?

రమేశ్‌కుమార్: ఇలా తొలగించిన సిబ్బంది శిక్షార్హులు. ఎలాంటి కారణాలూ చూపకుండా ఓట్లు తొలగించారని విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో రామ్ అనే వ్యక్తి ఈసీకి, ఎన్‌హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. ఈసీ స్పందించి తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ లేఖ రాసింది. బీఎల్వో, సూపర్‌వైజర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలే కాదు, సెక్షన్ 32 ఆర్‌పీఐ యాక్ట్ ప్రకారం క్రిమినల్ కేసులు పెట్టాలి. ఈ చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ నిర్లక్ష్యం కిందకు వస్తుంది.

? అభ్యంతరాల స్వీకరణకు జనవరి 12వరకు, సవరణకు 17వరకు ఈసీ అనుమతిచ్చింది? ఏవైనాతప్పులుంటే ఆపై సరిదిద్దడానికి వీలుందా?

రమేశ్‌కుమార్: కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు నిరంతర ప్రక్రియ. ఇప్పటికే ఓటు నమోదు చేసుకున్న వారు ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే జనవరి 22న ఈసీ విడుదల చేసే తుది ఓటర్ల జాబితాలో ఓటు హక్కు పొందుతారు. ఇప్పటినుంచి చేసే మార్పులు, చేర్పులన్నీ నామినేషన్ల ప్రక్రియ నాటికి ఇచ్చే సప్లిమెంటరీ జాబితాలో వస్తాయి.

? ప్రశ్న: హెల్త్ పారామీటర్లు అంటే ఏమిటి?

రమేశ్‌కుమార్: సాధారణంగా జనాభాలో 61 శాతం ఓటర్లు ఉండాలి. మహిళలు, పురుషుల ఓటర్ల సంఖ్య సమానంగా ఉండాలి. అసమానతలు ఉంటే అక్కడ ఈసీ నిర్దేశించినట్లుగా ఓటర్ల జాబితా తయారు కాలేదని అర్థం. కొత్త ఓటర్ల నమోదు 1 శాతానికి తగ్గకుండా ఉండాలి. తక్కువగా ఉంటే కొత్తఓటర్ల నమోదులో యంత్రాంగం క్రియాశీలకంగా వ్యవహరించలేదని అర్థం. వీటన్నింటినీ హెల్త్ పారామీటర్లు అంటారు. క్షేత్రస్థాయిలో ప్రతి నియోజకవర్గంలో ఎంపిక చేసిన 20 బూత్‌లలో అత్యంత ఎక్కువగా చేరికలు, తొలగింపులపై వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించాలి. ఇలా 20 నియోజకవర్గాల్లో తనిఖీ చేస్తారు.

? చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్ల చేరికలు, తొలగింపులకు 1.16 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. కొత్త ఓటర్ల నమోదుకు 49,956 అర్జీలు వచ్చాయని ఈసీ అధికారికంగా చెప్పింది. ఒక్క నియోజకవర్గంలోనే ఇన్ని రావడాన్ని ఎలా చూడాలి?

రమేశ్‌కుమార్: ఇది ప్రమాదకర సంకేతం. చంద్రగిరిలో 2019 నాటికి 2.92 లక్షల మంది ఓటర్లున్నారు. ఈసీ హెల్త్ పారామీటర్ల ప్రకారం వార్షికంగా ప్రతి నియోజకవర్గంలో కొత్తగా 4 శాతం మంది నమోదు చేసుకుంటే, 2 శాతం మంది తొలగింపునకు అర్జీలిస్తుంటారు. అంటే వార్షిక పెరుగుదల 2 శాతమే ఉంటుంది. 2019 నుంచి 2024 ఎన్నికల వరకు సుమారు 10 శాతం ఓట్ల పెరుగుదలకు అవకాశముంది. కానీ చంద్రగిరిలో ఫాం-6, 7, 8 అన్నీ కలిపి 1,17,901 అర్జీలు అందాయి. ఇందులో కొత్తగా ఓటు కోసం అర్జీ పెట్టుకున్నవారు చంద్రగిరిలోని 7 మండలాల్లో కలిపి 49,956 మంది ఉంటే, ఒక్క తిరుపతి గ్రామీణ మండలంలోనే 24 వేల మంది ఉన్నారు. ఇంకా ఆశ్చర్యమేంటంటే ఈసీ చేపట్టిన ఇంటింటి సర్వేలో 3,213 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సాధారణంగా ఇంటింటి సర్వేనే ప్రామాణికంగా తీసుకుంటారు. 49,956 దరఖాస్తుల్లో ఇవి మినహా మిగతావన్నీ ఈసీ వెబ్‌సైట్ ద్వారా గంపగుత్తగా వచ్చినవే. అదేవిధంగా తొలగింపునకు కూడా 30 వేలకుపైగా అర్జీలు వచ్చాయి. ఇక్కడ ఈసీ నిశిత పరిశీలన చేయాల్సి ఉంది.

? ఎన్నికలు జరిగిన వెంటనే ఫలితాలు ప్రకటించకుండా, నెలల సమయం తీసుకోవడం వల్ల ఫలితాలు మారే అవకాశముందా?

–యాసిన్, గుంటూరు

సమాధానం: ఆ అవకాశం లేదు. ఈవీఎంల ద్వారా నిర్దేశించిన సమయంలో కొన్ని గంటల్లోనే ఫలితాలు వెల్లడవుతాయి.

? రాష్ట్రంలో భారీగా ఓట్లు తొలగిస్తున్నారని ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు అలాంటిదేమీ లేదని చెబుతున్నారు. దీనిపై స్పష్టత ఇవ్వండి.

–భీమశంకరం, అమలాపురం

సమాధానం: రాష్ట్రంలో ఓటరు జాబితా లోపభూయిష్టంగా ఉందని కేంద్ర ఎన్నికల సంఘమే అంగీకరించింది. జీరో ఇంటి నంబర్లతో లక్షల ఓట్లు ఉన్నాయి. ఒకే ఇంటినంబర్‌తో ఉన్న ఓట్లు 25 లక్షల వరకు ఉన్నాయి. వీటిని సరిచేయకుండా ముసాయిదా జాబితా ప్రచురించారు.

? ఇంటి బ్లాక్ నంబర్ సరిగ్గానే ఉన్నా ఓటు తీసేశారు? అధికారులను అడిగితే సరిగ్గా లేదంటున్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే సచివాలయంలో అడగమంటున్నారు. అక్కడ పట్టించుకోవడం లేదు.

–సురేశ్‌వర్మ, రావులపాలెం

సమాధానం: ఇప్పటికే ఓటు ఉంటే, నోటీసు ఇవ్వకుండానే తొలగించే వీల్లేదు. తొలగించినట్లైతే సెక్షన్ 32ను అతిక్రమించినట్లే. వారిపై ఐపీసీ సెక్షన్ల కింద కేసు పెట్టే అధికారం ఈసీకి ఉంది. దీనిపై తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. **కంప్లైంట్స్ ఎట్ ఈసీఐ డాట్ గవ్ డాట్ ఇన్** ద్వారా నేరుగా ఈసీకి ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు ఈసీనే పర్యవేక్షిస్తుంది. జనవరి 22న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో సరిచూసుకోండి. లేకపోతే 15 రోజుల్లోగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయొచ్చు. లేదా ఫాం-6 ద్వారా మళ్లీ అర్జీ పెట్టుకుంటే సప్లిమెంటరీ జాబితాలో పేరు ఉండే అవకాశముంది.

ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూసుకుంటుంది

- అంగన్‌వాడీల అంశంపై మంత్రి బొత్స



బొబ్బిలి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు జనవరి 5 నుంచి గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్లు పంపిణీ చేయాలని, లేకపోతే ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూసుకుంటుందని మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పక్కి గ్రామంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'అంగన్‌వాడీ కార్యకర్తలు 11 సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఒక్క జీతాల పెంపు తప్ప మిగిలిన 10 డిమాండ్లకు సమ్మతించాం. అయినా వారు విధుల్లో చేరడం లేదు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు జీతం రూ.11,500 చేశాం. తెలంగాణ ప్రభుత్వం పెంచిన ప్రతిసారీ ఇక్కడ పెంచుతామన్నది ప్రభుత్వం ఉద్దేశం కాదు. అయినా జీతాల పెంపు అంశంపై నిర్ణయం తీసుకోవడానికి రెండు నెలలు ఆగాలని కోరాం' అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై మంత్రి బొత్సను ప్రశ్నించగా.. ఎవరైనా పార్టీలు పెట్టొచ్చు, మారొచ్చని.. వాటిలో కొన్ని ఉంటాయి, మరికొన్ని పోతాయని సమాధానం ఇచ్చారు. జిల్లాలో సిటింగ్‌లకు టికెట్ల విషయంలో మార్పులు ఏమైనా జరిగే అవకాశం ఉందా అని ప్రశ్నించగా.. అత్యుత్సాహం ఎందుకని బొత్స సమాధానమిచ్చారు.

విశాఖలో గ్యాంగ్‌రేప్

- దళిత బాలికపై పది మంది అత్యాచారం
- తొలుత ప్రియుడు.. అతడి స్నేహితుడు
- తరువాత నిర్బంధించి 8 మంది ఘాతుకం

విశాఖపట్నం (గురుద్వారా), న్యూస్‌టుడే: విశాఖలో ఒక దళిత బాలికపై పది మంది అత్యాచారానికి పాల్పడ్డారు. మానవ మృగాల చేతిలో బాలిక నరకాన్ని చవిచూసింది. పొరుగు రాష్ట్రం ఒడిశా నుంచి ఇంటి పనుల కోసం వచ్చిన 17 ఏళ్ల బాలికను వంచించి ప్రేమ పేరుతో ప్రియుడు తొలుత కామవాంఛ తీర్చుకున్నాడు. తన మిత్రుడినీ ఉసిగొలిపాడు. మరో ఎనిమిది మంది బాలికను రెండు రోజులపాటు లాడ్జిలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసి అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటన నగరవాసులను ఉలిక్కిపడేలా చేసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన ఓ కుటుంబం విశాఖ కంచరపాలెంలో నివసిస్తోంది. ఈ ఇంట్లోని బాలిక రైల్వే న్యూకాలనీలో ఓ ఇంట్లో కుక్కలకు ఆహారం పెట్టే పనికి కుదిరింది. బాలికకు భువనేశ్వర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో పరిచయమేర్పడి ప్రేమగా మారింది. ఈ నెల 18న ఆమెను ప్రియుడు నాల్గో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తన స్నేహితుడినీ రప్పించి అఘాయిత్యానికి పురమాయించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఆర్కే బీచ్‌కు వెళ్లి రోదిస్తుండగా.. పర్యాటకుల ఫొటోలు తీసే ఓ వ్యక్తి ఆమెను జగదాంబ కూడలి సమీపంలోని లాడ్జికి తీసుకెళ్లాడు. అక్కడ బంధించాడు. అతడితో సహా స్నేహితులు ఎనిమిది మంది రెండు రోజులపాటు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. భయాందోళనకు గురైన బాలిక వారి చెర నుంచి తప్పించుకుని ఒడిశాలోని కలహండి జిల్లాలో ఉన్న స్వగ్రామానికి వెళ్లిపోయింది. ఇంటినుంచి బాలిక వెళ్లిన 18వ తేదీనే అదృశ్యం కేసు నమోదు చేసిన నాల్గో పట్టణ పోలీసులు 22న ఆమెను గుర్తించి ఇక్కడి ఇంటికి చేర్చారు. మానసిక ఆందోళన, భయంతో ఆదివారం వరకు బాలిక తనకు జరిగిన అన్యాయాన్ని తల్లిదండ్రులతోనూ పంచుకోలేకపోయింది. తాను పడ్డ బాధలను ఆదివారం చెప్పడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నగరానికి చెందిన ఎనిమిది మందిని ఇప్పటివరకు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ప్రియుడు, అతడి స్నేహితుడు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి ఝార్ఖండ్, విశాఖ నగరాల్లో గాలిస్తున్నారు.

అమరావతి బృహత్ ప్రణాళికను దెబ్బతీసే కుట్ర

- భూసేకరణ ప్రకటన ఉపసంహరించేందుకు ఎత్తులు
- సీఆర్డీఏ అధికారుల ప్రయత్నాలు



ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి విషయంలో జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. నిర్మాణం పూర్తి చేయకుండా, వీలైనంత సంక్లిష్టంగా మార్చేందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా తెదేపా ప్రభుత్వ హయాంలో ఇచ్చిన భూసేకరణ ప్రకటనను ఉపసంహరించేందుకు సీఆర్డీఏ అధికారులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. తొలి విడతలో తాడేపల్లి మండలం ఉండవల్లి, పెనుమాకల్లో భూసేకరణలో ఉన్న భూములను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. తద్వారా రాజధాని బృహత్ ప్రణాళికను మరింత అస్థిరపరిచే కుట్రకు తెరలేపారని అమరావతి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగున్నరేళ్లలో ఎన్నో అడ్డంకులు...

అమరావతిని నిర్వీర్యం చేసేందుకు ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. మూడు రాజధానుల ప్రకటనతో చిచ్చు రేపింది. 19 గ్రామాలతో నగరపాలక సంస్థ ఏర్పాటుకు ప్రయత్నించింది. ప్రజాభిప్రాయ సేకరణ సభల్లో రైతులు ముక్త కంఠంతో దాన్ని వ్యతిరేకించారు. ఇది విఫలమవడంతో.. బయట ప్రాంతాల వారికి సెంటు స్థలాలు ఇచ్చేందుకు వైకాపా ప్రభుత్వం ఆర్-5 జోన్ ఏర్పాటు చేసింది. ఈ అంశం హైకోర్టులో విచారణలో ఉన్నా.. గ్రామసభల్లో, ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు ముక్తకంఠంతో వ్యతిరేకించినా జగన్ ప్రభుత్వం ఏకపక్షంగా గెజిట్‌ను విడుదల చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ రైతులు కోర్టులకు వెళ్లడంతో ప్రభుత్వ పిటిషన్లను న్యాయమూర్తులు కొట్టివేశారు. ఇది జీర్ణించుకోలేక సీఆర్డీఏ చట్టానికి జగన్ సర్కారు సవరణ చేసింది. కోర్టు పరిధిలో ఉన్నా గెజిట్ విడుదల చేయడం, సెంటు స్థలాల పట్టాలు ఇవ్వడం, ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం చకచకా జరిగిపోయాయి. దీనిపైనా కోర్టు స్టే ఇవ్వడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

రాజధాని నిర్మాణం కోసం గత ప్రభుత్వం 25,398 మంది రైతుల నుంచి 34,281 ఎకరాలు సమీకరించింది. అవసరమైన విస్తీర్ణంలో 89 శాతాన్ని పూలింగ్ విధానంలో రాబట్టింది. పలు గ్రామాల్లోని రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. అప్పటికే తెదేపా ప్రభుత్వం రాజధానిలో నవ నగరాల నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ రూపొందించింది. దీంతో బృహత్ ప్రణాళికకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భూములివ్వని గ్రామాల్లో సేకరణ ద్వారా తీసుకోవాలని నిర్ణయించి ఈ మేరకు 4,300 ఎకరాలకు ప్రకటన ఇచ్చారు. ఇందులో 191.62 ఎకరాలను మాత్రమే అప్పట్లో సేకరించారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు రైతులు అప్పట్లో కోర్టును ఆశ్రయించడంతో సేకరణ ప్రక్రియ నిలిచింది. ఇప్పుడు.. ఆ ప్రక్రియను నిలిపివేసి, ప్రకటనను వెనక్కి తీసుకునేందుకు ఉన్నత స్థాయి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సీఆర్డీఏ అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఉండవల్లిలో అవసరమని గుర్తించిన భూమిలో కేవలం 28 శాతమే పూలింగ్‌లో రైతులు ఇచ్చారు. ఇంకా 830.86 ఎకరాలు, పెనుమాకలో 562.65 ఎకరాల కోసం గతంలో భూసేకరణ ప్రకటన ఇచ్చారు. ఈ విస్తీర్ణాన్ని ప్రకటన నుంచి మినహాయించాలని అక్కడి అస్మదీయులతో పిటిషన్ పెట్టించి, కథ నడిపిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత ఇదే విధానాన్ని మిగిలిన భూసేకరణ గ్రామాల్లోనూ అమలు చేయనున్నట్లు తెలిసింది.

అమరావతి నిర్మాణానికి ఆటంకం...

ఇప్పటివరకు సేకరణలో ఉన్న భూముల క్రయవిక్రయాలపై నిషేధం అమల్లో ఉంది. ప్రకటన ఉపసంహరిస్తే కేవలం రోడ్లకు మాత్రమే భూమి ఉంచుకుని మిగిలింది రైతుల స్వాధీనంలోకి వెళ్తుంది. దీనివల్ల రాజధాని బృహత్ ప్రణాళికకు భంగం కలుగుతుంది. దాని స్వరూపం మొత్తం దెబ్బతింటుంది. అభివృద్ధి కుంటుపడుతుంది. ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి. సీఆర్డీఏ చట్టం ప్రకారం భూమి ఇచ్చిన రైతులు కూడా భాగస్వాములే. ఒప్పందం ప్రకారం 25 ఏళ్ల వరకు మాస్టర్ ప్లాన్‌ను మార్చడానికి వీల్లేదు. ఆ తర్వాత కూడా రైతుల అంగీకారం మేరకు సవరణలు చేయాల్సి ఉంటుంది. కానీ రైతుల నుంచి ఎటువంటి సమ్మతి లేకుండానే ఇష్టానుసారం చేస్తున్నారు.

వైకాపా నాయకుల వేధింపులతోనే బలవన్మరణం

- అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు నుంచి తప్పిస్తామని బెదిరిస్తున్నారు
- ఆత్మహత్యకు పాల్పడిన సాక్షి విలేకరి భార్య ఆవేదన



మాట్లాడుతున్న దామోదరరావు కుటుంబసభ్యులు

లావేరు, న్యూస్‌టుడే: కుటుంబ పెద్దను కోల్పోయి ఆందోళనలో ఉన్న తమను మానసికంగా చంపొద్దని ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన సాక్షి విలేకరి దామోదరరావు భార్య సుజాత కన్నీటిపర్యంతమయ్యారు. దామోదరరావు మృతిపై శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో శనివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఆయనతో వేదికపై ఉన్నవారు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ మేరకు లావేరు పంచాయతీ కేశవరాయనిపురం గ్రామంలో సుజాత ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 'నా భర్త మానసికంగా ఎంత బాధపడకపోతే లేఖ రాసి జేబులో పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటారో అర్థం చేసుకోవాలి. ఎమ్మెల్యే నిర్వహించిన సమావేశంలో లావేటిపాలెం గ్రామానికి చెందిన కొందరు మా కుటుంబసభ్యులమని చెప్పుకొని నా భర్త గురించి అనుచితంగా మాట్లాడారు. ఏడాది కిందట మా పంచాయతీకి చెందిన కొందరు వైకాపావారు మా కుటుంబంపై దాడికి వచ్చారు. వారే శనివారం ఎమ్మెల్యే పక్కన కూర్చుని మాట్లాడారు. వైకాపా కోసం తొమ్మిదేళ్లు కష్టపడి పనిచేసిన నా భర్తకు ఎలాంటి న్యాయం చేయకపోగా.. తీవ్రంగా వేధించి పొట్టన పెట్టుకున్నారు. మాకు ఆర్థిక ఇబ్బందులున్నాయని, వాటిని తట్టుకోలేక నా భర్త బలవన్మరణానికి పాల్పడ్డారని కొందరు నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మా కుటుంబానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు. ఆయన మృతికి రాజకీయ వేధింపులే కారణం. లావేటిపాలెం గ్రామానికి చెందిన విశ్వనాథం నాకు ఫోన్ చేసి విలేకరుల సమావేశం నిర్వహిస్తే అంగన్‌వాడీ ఉద్యోగంనుంచి తప్పిస్తామని బెదిరించారు. మాకు ఇద్దరు చిన్న పిల్లలున్నారు. కుటుంబ పెద్ద లేని మమ్మల్ని ఎవరు ఆదుకుంటారు? ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి నా భర్త రాసిన లేఖపై దర్యాప్తు చేయాలి' అని ఆమె రోదించారు. 'వైకాపా కోసం కష్టపడిన వ్యక్తికి మీరిచ్చే గౌరవం ఇదేనా'? అని దామోదరరావు సోదరులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు కన్నీటిపర్యంతమయ్యారు.

పెద్ద సంఖ్యలో తజిక్‌లు, పాకిస్థానీయులను చంపేశాం

అఫ్గానిస్థాన్ ప్రకటన

ఇస్లామాబాద్: తమ దేశంలో అరాచకానికి పాల్పడుతున్న తజిక్, పాకిస్థాన్ జాతీయులను తమ భద్రతా బలగాలు పెద్ద ఎత్తున మట్టుబెట్టాయని అఫ్గానిస్థాన్ ఆదివారం ప్రకటించింది. మతపెద్దలు, ప్రజలు, మసీదులపై దాడులకు ప్పాలడినందున వారికి ఆ గతి పట్టిందని తెలిపింది. తాలిబన్ నియమిత రక్షణమంత్రి మహ్మద్ యాకుబ్ ముజాహిద్ ఆదివారం దేశ రాజధాని కాబుల్‌లో విలేకరులతో మాట్లాడారు. భద్రతా బలగాలు గడచిన 12 నెలల్లో నిర్వహించిన వివిధ ఆపరేషన్లలో డజన్ల కొద్దీ తజిక్‌లను, 20 మందికి పైగా పాకిస్థానీయులను హతమార్చాయన్నారు. అలాగే పెద్దఎత్తున తజక్‌లు, పాక్ జాతీయులనూ అరెస్టు చేశారని వెల్లడించారు. పాకిస్థాన్‌లో అక్రమంగా నివసిస్తున్న లక్షలమంది అఫ్గానిస్థానీయులను బెదిరింపులతో వారి దేశానికి పంపేసిన నేపథ్యంలో పాక్‌తో అఫ్గాన్‌కు దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

శిమ్లాకు తగ్గిన పర్యాటకులు

శిమ్లా: ప్రఖ్యాత పర్యాటక కేంద్రం శిమ్లాలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. అయితే 40 ఏళ్లలో తొలిసారి ఇక్కడ పర్యాటకుల తాకిడి తగ్గింది. స్థానిక హోటల్ గదులు ఈసారి 60 శాతమే నిండాయి. గతేడాది నూతన సంవత్సరం సందర్భంగా ఇది 80 శాతంగా నమోదైంది. ఈ వారంతంలో మంచు కురిసే అవకాశం తక్కువుందన్న అంచనాలు పర్యాటకుల రాకపై ప్రభావం చూపాయి. మద్యం సేవించిన పర్యాటకులను అరెస్టు చేయొద్దని, వారి కొత్తసంవత్సర వేడుకలను చెడగొట్టొద్దని హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు పోలీసులకు చేసిన సూచనలు పెద్దగా ఉపకరించలేదు. కొవిడ్ విజృంభించిన కాలంలోనూ ఇప్పటి కంటే ఎక్కువ శాతం హోటళ్లు బుకింగ్‌లతో నిండాయని శిమ్లా హోటల్, టూరిజం స్టేక్‌హోల్డర్స్ అసోసియేషన్ తెలిపింది.

పెట్రోల్, డీజిల్ వాహనాలు కొనొద్దు

- హిమాచల్ సీఎం ఆదేశం

శిమ్లా: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు అన్ని ప్రభుత్వ శాఖలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జనవరి 1, 2024 నుంచి డీజిల్, పెట్రోలు వాహనాలను కొనుగోలు చేయొద్దని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రోత్సహించడంతోపాటు 'గ్రీన్ అండ్ క్లీన్ హిమాచల్' లక్ష్యాన్ని సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ఓ ప్రకటనలో సీఎం పేర్కొన్నారు. ఒకవేళ ఏవైనా ప్రభుత్వ శాఖలు డీజిల్ లేదా పెట్రోలు వాహనాలు కొనాలనుకుంటే రాష్ట్ర కేబినెట్ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ప్రభుత్వ ఈ-వాహనాల సంఖ్య 185కు చేరగా.. ప్రైవేటు ఈ-వాహనాల సంఖ్య 2,733గా ఉందని సీఎం అన్నారు. "రాష్ట్రంలో మా ప్రభుత్వం ఈ-వాహనాలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. రవాణాశాఖ తన అధికారిక వాహనాలను ఈ-వాహనాలతో భర్తీ చేసిన తొలి విభాగంగా నిలిచింది. ఇతర ప్రభుత్వ శాఖలన్నీ ఇదే విధానాన్ని అనుసరించాలి" అని సీఎం సుఖు పేర్కొన్నారు.

దేశంలో కరోనాతో ముగ్గురి మృతి

దిల్లీ: దేశంలో కొత్తగా 841 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 227 రోజుల్లో ఇదే అత్యధికం. దీంతో క్రియాశీల కేసుల సంఖ్య 4,309కు చేరుకున్నాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది. గడిచిన 24 గంటల్లో కరోనా వల్ల కేరళ, కర్ణాటక, బిహార్‌లో ఒక్కొక్కటి చొప్పున మూడు మరణాలు సంభవించాయి.